నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, బుధవారం 21 మే 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

వేయిస్తంభాల ఆలయంలో కమల్‌చంద్రభంజ్‌దేవ్ కాకతీయను సన్మానించి ఆశీర్వచనం ఇస్తున్న ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ

# సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలి

- భావితరాలకు మన చరిత్ర, వారసత్వ సంపదను పరిచయం చేయాలి
- కమల్‌చంద్ర భంజ్‌దేవ్ కాకతీయ
- ఓరుగల్లులో కాకతీయుల 22వ వారసుడి పర్యటన

హనుమకొండ/వరంగల్/ఖిలా వరంగల్/హనుమకొండ చౌరస్తా/పోచమ్మమైదాన్, మే 20 : మన సంస్కృతీసంప్రదాయాలు, వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని కాకతీయుల 22వ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్ కాకతీయ పేర్కొన్నారు. మంగళవారం ఓరుగల్లు పర్యటనలో భాగంగా హనుమకొండ నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో ప్రజలతో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రపంచానికి విజ్ఞానాన్ని, సంప్రదాయాలను, సంస్కృతిని పరిచయం చేసిన మహోన్నత దేశం భారతదేశమని అన్నారు. ప్రపంచ దేశాలకు భాష, లిపి లేనప్పుడే మనం గుళ్లు కట్టడంతో పాటు భాషను, లిపిని కొనసాగించామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులకు మన వారసత్వ సంపద, చరిత్రను పరిచయం చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఓరుగల్లులో నిర్మించనున్న విమానాశ్రయానికి రాణీ రుద్రమదేవి పేరు పెట్టాలని గతంలోనే ప్రధాని నరేంద్రమోదీని కోరినట్టు ఆయన గుర్తుచేశారు. అలాగే కాకతీయుల సంపదైన కోహినూరు వజ్రాన్ని సైతం బ్రిటన్ నుంచి తెప్పించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. అక్కడినుంచి వడ్డేపల్లిలోని పోచమ్మ ఆలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఇంట్లో భోజనం చేసి బస్తర్ బయల్దేరారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, టార్చ్ సంస్థ వ్యవస్థాపకుడు అరవింద్ ఆర్య పకిడే, బీఆర్ఎస్ నాయకులు సంపతి రఘు, జానకీరాములు, డివిజన్ ప్రెసిడెంట్లు, సేవా టూరిజం కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ పాల్గొన్నారు.

### ఆలయాల పునర్నిర్మాణానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

వేయి స్తంభాల రుద్రేశ్వర ఆలయానికి రావడం ఇది రెండోసారి అని, హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ నుంచి అహోబిలం క్షేత్రం అటు తమిళనాడు, కర్ణాటక వరకు తమ పూర్వీకులు అనేక ఆలయాలను అద్భుతంగా నిర్మించారని వాటి పునర్నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కమల్‌చంద్ర భంజ్‌దేవ్ అన్నారు. ఓరుగల్లు పర్యటనలో భాగంగా ఆయన వేయిస్తంభాల ఆలయం, భద్రకాళీ ఆలయం, వరంగల్ కోట, మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయాలను మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్‌తో కలిసి సందర్శించారు. వేయిస్తంభాల ఆలయంలో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ స్వాగతం పలికి కాకతీయుల కాలం నాటి ఉత్తిష్ఠ గణపతికి పూజ, రుద్రేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం చేయించారు. నాట్యమండపంలో స్వామివారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రాలు అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ప్రాశస్త్యాన్ని అరవింద్ వివరించారు. అనంతరం భద్రకాళీ ఆలయంలో ఈవోలు శేషుభారతి, ప్రధాన అర్చకులు భద్రకాళీ శేషులు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అలాగే వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లోని రాణీ రుద్రమదేవి విగ్రహానికి నమస్కరించి పూలమాల వేశారు.

కోటలోని చతుర్ముఖ లింగానికి పూజలు చేస్తున్న కమల్‌చంద్ర భంజ్‌దేవ్ కాకతీయ, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, నన్నపునేని

## అక్రమ వెంచర్‌పై నోటీసులు

ఎనిమిది మందికి అందజేత



అక్రమ వెంచర్‌పై బాధ్యులకు నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తొర్రూరు, మే 20 : తొర్రూరు పట్టణంలోని అన్నారం రోడ్డులో డబుల్ బెడ్ రూం ఇండ్ల వెనుక భాగంలో కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆధ్వర్యంలో సర్వే నంబర్ 118లో నిర్మాణమవుతున్న అక్రమ వెంచర్‌పై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 18న 'నమస్తే తెలంగాణలో' ప్రచురితమైన 'అక్రమ వెంచర్లు... అడ్డగోలు అమ్మకాలు' కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు సంబంధిత యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. సర్వే నంబర్ 118లో పర్మిషన్ లేకుండా అభివృద్ధి చేస్తున్న 18 ఎకరాల అక్రమ వెంచర్‌కు సంబంధించి కల్లూరి హరిబాబు, చంద్రప్రకాశ్, కిషోర్, శ్రీనివాస్, పుల్లాచారి, యాదగిరి, శంకరాచారి, రవీంద్రాచారికి నోటీసులు అందించినట్లు మున్సిపల్ కమిషనర్ పీ శాంతికు మార్ తెలిపారు. నోటీసులు పంపినప్పటికీ స్పందించకపోతే, బోర్డులు నాటి ఇది అక్రమ వెంచర్ గా ప్రకటించి, ఎవరూ కొనుగోలు చేయొద్దని హెచ్చరికలు జారీ చేస్తామన్నారు.

# కేయూలో ఉద్రిక్తత

- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట
- లాక్కెళ్లి వ్యాన్ ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- దళిత విద్యార్థినులను దూషించిన సీఐ

## పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థుల ధర్నా

కేయూ పరిపాలనా భవనం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా/నయీంనగర్, మే 20: కాకతీయ యూనివర్సిటీలో పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కేయూ పరిపాలనా భవనం ఎదుట ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. సోమవారం అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగినప్పటికీ అధికారులు పరీక్షలు వాయిదా వేయకపోవడంతో మంగళవారం ఉదయం నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న కేయూ, హనుమకొండ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినకపోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. సిలబస్ పూర్తికాకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారని, పోటీ పరీక్షల కోసం ప్రిపేరవుతున్న క్రమంలో పరీక్షలు వాయిదా వేయాలని కోరినప్పటికీ అధికారులు వినిపించుకోవడం లేదని విద్యార్థులు వాపోయారు. యూనివర్సిటీ అధికారులు, పోలీసులకు వ్య తిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా చేస్తున్న క్రమంలో తోపులాట జరగగా, విద్యార్థులను లాక్కెళ్లి పోలీస్ వ్యాన్ ఎక్కించి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

### కులం పేరుతో దూషించారని విద్యార్థినుల ఆవేదన

పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని సోమవారం ఆందోళన చేస్తున్న క్రమంలో రాత్రి 1 గంటకు తమను లేడీ కానిస్టేబుళ్లు లేకుండా సీఐ రవికుమార్ స్టేషన్‌కు తీసుకుపోయి 3 గంటలకు వరకు ఉంచాడని విద్యార్థినులు అనూష, స్వాతి వాపోయారు. దళిత విద్యార్థినులని తెలుసుకున్న సీఐ 'నాకే ఎదురు తిరుగుతారా.. మీరు మళ్లీ ధర్నా చేస్తే స్టేషన్‌కు తీసుకొచ్చి నానా ఇబ్బందులకు గురిచేస్తాం'.. అంటూ బెదిరించినట్లు తెలిపారు. పోలీసు స్టేషన్‌కు తీసుకురావడమే కాకుండా బలవంతంగా సంతకాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. తాము ఏమైనా టెర్రరిస్టులమా అని విద్యార్థినులు నిలదీశారు.

పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న విద్యార్థులు

# మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంపై వేటు

- సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు
- నిందితులకు సహకారం, బాధితులపైనే తప్పుడు కేసులు
- అధికార పార్టీ అండతో హద్దుమీరిన ఫలితం

సుబేదారి/కరీమాబాద్, మే 20 : మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ జె.వెంకటరత్నంను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఓ భూ వివాదం కేసులో బాధితులను న్యాయం చేయకుండా వారిపైనే తప్పుడు కేసు పెట్టడంతో పాటు చనిపోయిన వ్యక్తి పేరు కూడా కేసులో నమోదు చేసి నిందితులకు సహకరించినట్లు సీపీ విచారణలో తేలడంతో అతడిపై వేటుపడింది. అలాగే ఇటీవల భట్టుపల్లి రోడ్డులో జరిగిన హత్య కేసులో మహిళా నిందితురాలితో సదరు ఇన్‌స్పెక్టర్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కూడా విచారణలో తేలింది. ఇవేకాకుండా మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వెంకటరత్నం వివాదాస్పద పోలీసు అధికారిగా పేరొందారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఓ మాజీ రౌడీషీటర్‌తో అంటకాగి భూ వివాదాల్లో తలదూర్చి బాధితులను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి సెటిల్‌మెంట్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చివరకు వెంకటరత్నం సస్పెండ్ కావడంతో బాధితులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. మాజీ రౌడీషీటర్ అండతో తమను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశాడని.. పాపం పండిందంటూ మిల్స్‌కాలనీ స్టేషన్ పరిధిలో పలువురు బాధితులు చర్చించుకోవడం గమనార్హం.

### ఎమిమిది నెలల్లో ఇద్దరిపై వేటు

పలువురు ఇన్‌స్పెక్టర్ల తీరుతో శాఖాపరమైన చర్యలకు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ కేంద్ర బిందువుగా మారింది. విధి నిర్వహణలో అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాయడం, నిందితులకు సహకరిస్తూ బాధితులను బెదిరిస్తూ పోలీసు శాఖకే మచ్చ తెచ్చేలా వ్యవహరించారనే ఆరోపణలతో ఎనిమిది నెలల కాలంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై వేటు పడింది. తాజాగా సస్పెండ్ అయిన వెంకటరత్నం కంటే ఎనిమిది నెలల క్రితం ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న మల్లయ్య కూడా మాజీ రౌడీషీటర్ అండతో హద్దులు దాటి ప్రవర్తించిన కారణంగా ఆయనను సస్పెండ్ చేశారు. అంతేగాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు, కేసుల విషయంలో సిబ్బందితో వెంకటరత్నం వ్యవహరించిన తీరుపైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఫిర్యాదులను పరిష్కరించకుండా నెలల తరబడి తిప్పుకొంటున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. ఇలా సీఐగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వెంకటరత్నం ఇదే తీరుగా వ్యవహరించడం.. ఉన్నతాధికారులు చేపట్టిన విచారణలోనూ నిజమని తేలడం వేటుపడింది.

వెంకటరత్నం

# రెండు రోజులుగా చీకట్లోనే ఉంటున్నం..

ట్రాన్స్‌ఫార్మర్ కాలినా పట్టించుకోవడం లేదని తండావాసుల ఆవేదన

కాలిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలుపుతున్న తారాసింగ్ తండా ప్రజలు

నర్సింహులపేట, మే 20: ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రెండు రోజులుగా చీకట్లో ఉంటున్నా అధికారులు స్పందించడం లేదని పెద్దనాగారం స్టేజీ జీపీ పరిధిలోని తారాసింగ్ తండావాసులు ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ సరఫరా అయ్యే సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని చెప్పినా ఏఈ రాడు.. లైన్‌మన్ పట్టించుకోవడం లేదని నిరసన తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లేందుకు వాహన ఖర్చులు, ఫిట్టింగ్ ఖర్చులు తామే భరించాలంటున్నారని.. ఇదివరకు పదిసార్లు కేబుల్ వైర్ కాలిపోతే ప్రతి ఇంటి నుంచి డబ్బులు వసూలు చేసి ఇస్తేనే హెల్పర్ బాగుచేశాడంటూ గోడు వెల్లబోసుకున్నారు.

**తండా మొత్తానికి ఒకటే లైటు : భూక్యా చందు**

తండా మొత్తంలో 9 పోల్లు ఉంటే ఒక లైటు వెలుగుతుంది. పంచాయతీ కార్యదర్శిని లైట్లు వేయమంటే జీపీలో పైసలు లేవంటాండు. మా తండాను ఎవరూ పట్టించుకోవడం లేదు. చిన్న తండా అని చిన్నచూపు చూస్తున్నారు. మొన్న వచ్చిన వానకు చీకట్లో పాములు, తేళ్లు వస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఫిట్ చేసి లైట్లు పెట్టాలి.

మళ్లీ చెప్పుల క్యూ

ఎప్పుడో పదేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కనబడిన చెప్పుల క్యూ మళ్లీ ఇప్పుడు కనబడింది. జీలుగ విత్తనాల కోసం కమలాపూర్ వ్యవసాయ సహకార పరపతి సంఘానికి వచ్చిన రైతులు ఎండ తీవ్రతకు లైన్‌లో నిలబడలేక ఇలా చెప్పులు క్యూలో పెట్టారు. – కమలాపూర్, మే 20

# జమ్ముకశ్మీర్‌లో ఆర్మీ జవాన్ ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో నాగరాజు బలవన్మరణం
- మూడు రోజులకు స్వగ్రామానికి చేరిన మృతదేహం
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధువులు

నాగరాజు (ఫైల్)

నర్సంపేట, మే 20: జమ్ముకశ్మీర్‌లో నర్సంపేటకు చెందిన ఆర్మీ జవాన్ కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు రోజుల తర్వాత స్వగ్రామానికి మృతదేహం చేరుకోగా, శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధువులు దహన సంస్కారాలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. నర్సంపేట పట్టణం సర్వాపురం 4వ వార్డుకు చెందిన సంపంగి మల్లయ్య–విజయ దంపతులకు ముగ్గురు సంతానం. చిన్న కుమారుడైన నాగరాజు (28) 2016లో ఆర్మీ జవాన్‌గా ఎంపికై మూడేళ్లుగా జమ్ముకశ్మీర్ సరిహద్దు ప్రాంతమైన సాంబా సెక్టార్‌లో బీఎస్ఎఫ్ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత మార్చిలో సెలవుపై స్వగ్రామానికి వచ్చి ఏప్రిల్ 23న తిరిగి వెళ్లాడు. అప్పటి నుంచి నిత్యం తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడేవాడు. ఈక్రమంలో మానసిక ఆందోళన గురైన నాగరాజు గత ఆదివారం తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. జవాన్ మృతదేహాన్ని ఆర్మీ అధికారులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, నాగరాజు చిన్నతనం నుంచి దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరాలనే కోరిక ఎక్కువగా ఉండేదని వారు చెప్పారు. తాను చనిపోతే ఏడవొద్దని, సంతోషంగా దహన సంస్కారాలు నిర్వహించాలని చెబుతుండేవాడని పేర్కొన్నారు.

**ఏడాది వ్యవధిలోనే అన్నదమ్ములు మృతి**

ఆర్మీ జవాన్ అన్న వెంకటేశ్ ఏడాది క్రితం మృతి చెందాడు. ఏడాది వ్యవధిలోనే అన్నదమ్ముల మృతి ఆ కుటుంబ సభ్యులను తీవ్రంగా కలిచివేసింది. వృద్ధులైన తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు. జవాన్ మృతదేహంపై పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సంపేటలోని శ్మశానవాటిక వరకు నాగరాజు అంతిమ యాత్ర నిర్వహించారు.



అస్వస్థతకు గురైన వృద్ధుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే మంగళవారం సరస్వతీ పుష్కరాల ఏర్పాట్లను సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఘాట్ పరిసర ప్రాంతాల్లో బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. తాత్కాలిక బస్టాండ్ ప్రాంతంలో అదనపు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, చలివేంద్రాలు పెంచాలని సూచించారు. ప్రతి రోజూ రాత్రి 7.30 గంటల నుండి నిర్వహిస్తున్న సరస్వతీ నవరత్నమాల హారతి ఘట్టాన్ని భక్తులు వీక్షించడానికి ప్రత్యక్ష ప్రసారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. మహిళల సౌకర్యార్థం మాతా శిశు కేంద్రం, షీ గదిని ఏర్పాటు చేసినట్లు సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తెలిపారు. షీ రూమును, బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాన్ని మహిళలు, పాలిచ్చే తల్లులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సరస్వతీ నవరత్నమాల హారతి ఇస్తున్న అర్చకులు

## అస్వస్థతతో పారిశుధ్య కార్మికుడి మృతి

శ్రీనివాస్ (ఫైల్)

కాటారం : మండలంలోని గంగారం గ్రామపంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికుడు మంతెన శ్రీనివాస్ (35) వడదెబ్బకు గురై మృతి చెందాడు. సరస్వతీ పుష్కరాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి ఇంటి వద్ద మృతి చెందాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శి కరుణాకర్ మృతుడి దహన సంస్కారాల కోసం కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని డీపీవో వీరభద్రయ్య పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మృతుడి భార్యకు ఉద్యోగం కల్పించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా యూనియన్ నాయకులు మెండ మల్లికార్జున్ రావు, చిట్యాల శశికుమార్, యూనియన్ మండల అధ్యక్షుడు పప్పుల లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. అలాగే ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి సంతాపం ప్రకటించారు. మృతుడి కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# జన నీరాజనం

- సరస్వతీ పుష్కరాలకు పోటెత్తిన భక్తులు
- నదీమ తల్లికి పూజలు చేసి చీరె, సారె సమర్పణ
- ఏర్పాట్లు సరిగ్గా లేవని పెదవి విరుపు
- ఎండ వేడిమికి విలవిలలాడిన వృద్ధులు
- వడదెబ్బతో పారిశుధ్య కార్మికుడి మృతి

త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహాదేవపూర్(కాళేశ్వరం)/ చిట్యాల మే 20 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు జనం నీరాజనం పలికారు. మంగళవారం ఆరో రోజు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 70 వేల మంది భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. త్రివేణి సంగమంలో భక్తులు పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, నదిలో ప్రత్యేక పూజలు చేసి చీరె, సారె, ఒడి సమర్పించారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. పుష్కరాల్లో ఏర్పాట్లు సరిగా లేవని భక్తులు పెదవి విరుస్తున్నారు. మహిళలు దుస్తులు మార్చుకునే తాత్కాలిక గదులు రద్దీకి తగినట్లుగా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీ ఘాట్, ఆలయ పరిసరాల్లో భక్తులు సేద తీరేందుకు సరిపడా చలువ పందిళ్లు లేక వృద్ధు లు, చిన్నారులు ఎండ వేడిమికి విలవిలలాడారు. అదేవిధంగా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణ మూర్తి (66) ఎండ వేడి తాళ లేక తీవ్ర అస్వస్థతకు గురికాగా ఆస్పత్రికి తరలించారు. కాగా, పుష్కరాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన జాయ్ రైడ్‌లో భక్తులు ఒక్కొక్కరు రూ. 4500 చెల్లించి హెలికాప్టర్ ద్వారా కాళేశ్వర క్షేత్ర అందాలను వీక్షించారు. రాత్రి పేద పండితులు నవరత్న మాల హారతి కార్యక్రమం నిర్వహించగా, మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి పాల్గొన్నారు.

### ఏర్పాట్లు సరిగా లేవు

పుష్కరాల్లో అధికారులు ఏర్పాట్లు సరిగా చేయలేదు. సరస్వతీ ఘాట్ వద్ద ఇసుకపై నడిచేందుకు మ్యాట్ వేయకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాం. అంతా అస్తవ్యస్తంగా ఉంది. సామాన్య భక్తులను అధికారులు పట్టించుకోవడం లేదు. చలువ పందిళ్లు సరిపడా లేవు. ఎండకు మాడిపోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు భక్తుల సమస్యలపై దృష్టి పెట్టాలి.

– సతీశ్‌కుమార్, భూపాలపల్లి

# పోచంపల్లిలో నీటి కష్టాలు

ఇంటింటికీ జీపీ ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్న కార్మికులు

- మెయిన్ రోడ్డులో చెడిపోయిన బోర్ మోటర్
- దాన్ని బయటకు తీసేందుకు కార్మికుల అవస్థలు
- జీపీ ట్యాంకర్‌తో నివాస గృహాలకు నీటి సరఫరా

పెద్దవంగర, మే 20 : మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని పోచంపల్లి గ్రామ మెయిన్ రోడ్డు నివాస గృహాలకు నీటి కష్టాలు తప్పడం లేదు. కొద్దిరోజులుగా బోరు మోటర్ మరమ్మతుకు రావడంతో పాటు మిషన్ భగీరథ నీరు సైతం సరిగా రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. బోరు మోటర్ పంపును బయటకి తీసేందుకు జీపీ కార్మికులు మండుటెండలో అవస్థలు పడ్డారు. పంపు బోరులోనే పూడిపడిపోయింది. నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా రెండు రోజులుగా మెయిన్ రోడ్డు గృహ నివాసాలకు నీటి సమస్య ఏర్పడిందని చెప్పారు. పనులు చేస్తున్న క్రమంలో మోటర్ పంపు బోరులో ఊడిపోయింది. త్వరలోనే పూర్తి స్థాయిలో పనులు చేస్తామన్నారు. ప్రస్తుతం ట్యాంకర్ సహాయంతో ఇండ్లకు నీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు.

పోచంపల్లిలో మెయిన్ రోడ్డులో గల బోరు మోటర్‌ను మండుటెండలో తీస్తున్న జీపీ కార్మికులు